# కండ్లకుంట దాడి కేసులో 44 మందికి జైలు

## తీర్పు విన్న ముద్దాయి పరారీ

(ఆంధ్రప్రభ లీగల్ కంట్రిబ్యూటర్)

గుంటూరు, ఏప్రిల్ 1:వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో ఐదేళ్ళ క్రితం చెంచులు, లంబాడీలపై జరిగిన దాడి కేసులో 44 మంది నిందితులకు పదేళ్ళ కఠిన కారాగారాశిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 9500 రూపాయల జరిమానా కూడా విధిస్తూ షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచార నిరోధక చట్టం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీ యం.జగన్నాథం మంగళవారంనాడు సంచలనాత్మకమైన తీర్పుచెప్పారు. కాగా తీర్పు విన్న అనంతరం ముద్దాయిలలో ఒకరైన గాదె వెంకట రెడ్డి (45) ఎస్కార్ట్ పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు. ముద్దాయి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసులోని ముద్దాయిలందరూ వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన వారు. శివారు గ్రామమైన గుదిపెదచెరువు ప్రాంతంలో సుమారు 30 ఏళ్ల క్రితం మూడువందల ఎకరాల మెట్ట భూమిని చెంచులకు, ఇతరులకు ఒక్కొక్కరికి రెండున్నర ఎకరాల చొప్పున పంపిణీ చేశారు. అయితే చెంచులు తమ అవసరాల నిమిత్తం ఆ భూమి ని కండ్లకుంట కు చెందిన రెడ్డి కులస్థులకి తాకట్టుపెట్టి డబ్బు తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన రెవిన్యూ అధికారులు తిరిగి ఆ భూమిని స్వాధీనంచేసుకొని అనధికారకంగా మొత్తం పట్టా భూమిలో సగం రెడ్డి కులస్థులకి సగం భూమి చెంచు కులస్థులకు స్వాధీనంచేశారు. కాని రెడ్డి కులస్థులు చెంచులని ఆ భూమిలో వ్యవసాయం చేయకుండా నిరోధిస్తూవచ్చారు. ఇందుకు ప్రతీకారంగా చెంచులు కండ్లకుంట రైతులకు చెందిన పొలాలపై దాడి చేసి పంటలను ధ్వంసంచేశారు. తరువాత చెంచు కులస్థులు సివిల్ కోర్టులో దావాలువేసి తిరిగి భూములను స్వాధీనం చేసుకుని సాగుచేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో 1992 జనవరి 17న కండ్లకుంట గ్రామానికి చెందిన రెడ్డి, యాదవ, విశ్వబ్రహ్మణ కులస్థులు మొత్తం 48 మంది కలిసి కత్తులు, బరిశెలు, గొడ్డళ్ళు, కర్రలు, బాంబులతో మూకుమ్మడిగా చెంచులు, లంబాడీలపై దాడిచేసి వాళ్ళ పంటలను ధ్వంసంచేసి తరిమికొట్టారు. అంతేగాకుండా చెంచు గూడెంలోని వారి ఇళ్లపై కూడా దాడిచేసి వారి గుడిసెలకి నిప్పుపెట్టి వారిని తీవ్రంగా హింసించారు. ఈ చర్యలకు భీతిల్లిన చెంచులు, లంబాడీలు పరిసర అడవి ప్రాంతాలలోకి పారిపోయారు. మరుసటిరోజు వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఈ విషయంపై ఫిర్యాదుచేయగా పోలీసులు 48 మందిని కేసులో ముద్దాయిలుగా పేర్కొన్నారు. కేసు విచారణ సమయంలో ఒక ముద్దాయి చనిపోగా, ముగ్గురు ముద్దాయిలపై కేసును వేరుచేశారు. గుంటూరులోని ప్రత్యేక న్యాయస్థానం జరిపిన విచారణలో మొత్తం 25 మంది సాక్షుల వాంగ్మూలాన్ని న్యాయమూర్తి శ్రీ యం.జగన్నాథం నమోదు చేసిన అనంతరం ఈ తీర్పు ఇచ్చారు.